క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రాళ్లదొడ్డిలో లబ్ధిదారురాలికి భూ హక్కు పత్రాన్ని అందజేస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరురూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో కడిమెట్ల, రాళ్లదొడ్డి, మల్కాపురం, పెసలదిన్నె, ఏనుగుబాల గ్రామాల వారికి శాశ్వత భూహక్కు పత్రాలను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ హక్కు పత్రాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. మండల అధ్యక్షులు గొల్ల కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంపీడీఓ బంగారమ్మ, ఈఓఆర్డీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలి



గోనెగండ్లలో సచివాలయం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ఏఈ శివశంకర్

గోనెగండ్ల: ప్రభుత్వ భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని, పీఆర్ఏఈ శివశంకర్ కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన మంగళవారం గోనెగండ్లలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామ సచివాలయాలు 7, ఆర్బీకేలు 4, హెల్త్ క్లినిక్‌లు 4 పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు పేర్కొన్నారు. త్వరలో అన్ని భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. భవన నిర్మాణాలకు బిల్లులు సకాలంలో మంజూరవుతున్నాయని చెప్పారు. కాంట్రాక్టర్ అమరేశ్వరప్ప తదితరులు ఉన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆటోరంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు కోరారు. మంగళవారం స్థానిక లేబర్ కార్యాలయం ముందు ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని లేబర్ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌కు అందజేశారు.ఆయన మాట్లాడుతూ.. ఎమ్మిగనూరులో ఆటో నగర్ ఏర్పాటు చేయాలని, 50 ఏళ్లు దాటిన ఆటో కార్మికులకు పింఛన్ మంజూరు చేసి బీమా సౌకర్యం వర్తింపజేయాలన్నారు. ఎఐకేఎంఎస్ కార్యదర్శి సత్యన్న, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో భూసర్వే పూర్తి చేయాలి

పత్తికొండ రూరల్: డివిజన్‌లో నెలరోజుల్లోగా సమగ్ర భూసర్వే పూర్తి చేయాలని ఆర్డీఓ మోహన్‌దాస్ ఆదేశించారు. ఆయన మంగళవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో భూసర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఇప్పటివరకు పలు గ్రామాల్లో భూసర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ నెలలోగా డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై అవగాహన

హాలహర్వి: మండలంలోని మెదేహాల్ గ్రామంలో సమగ్ర సర్వేపై తహసీల్దార్ మల్లికార్జున రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మెదేహాల్ గ్రామంలో భూరీసర్వే ఈనెల30వ తేదీనుంచి మొదలవుతుందన్నారు. భూములను పక్కాగా సర్వే చేసి సరిహద్దు వద్ద రాళ్లను పాతిస్తామని చెప్పారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూసర్వే డీటీ బ్రహ్మయ్య, ఎంపీడీఓ ఆంతోని, వీఆర్వోమస్తాన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేపట్టండి

మద్దికెర: రైతులు నష్టపోకుండా పంట నమోదు పక్కాగా చేపట్టాలని ఏఓ రవి అన్నారు. మంగళవారం మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాలలో పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆయా గ్రామాలలో 15 వేల ఎకరాలలో వివిధ పంటలు సాగయ్యాయన్నారు. ఇప్పటివరకు 4,257 ఎకరాలలో ఈ-క్రాప్ పూర్తయినట్లు చెప్పారు. త్వరలోనే వంద శాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కేజీబీవీలో డైరెక్ట్ అడ్మిషన్లు

నందవరం: మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి సంబంధించి డైరెక్ట్ అడ్మిషన్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 30 సీట్లు మిగిలి ఉన్నాయని 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం @ 300



రాతనలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 300 రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవికి కేక్ తినిపిస్తున్న దృశ్యం

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మేలును తెలియజేసేందుకు, స్థానిక సమస్యలకు పరిష్కారం చూపేందుకు 'గడప గడపకూ వస్తున్నామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం మంగళవారం నాటికి 300 రోజులు పూర్తి చేసుకుంది. గతేడాది మే 11న మద్దికెరలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించారు. ఇప్పటి వరకు 78 సచివాలయాల పరిధిలో 80 వేల ఇళ్లను తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టారు. అవే కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం రాతనలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ మోహన్‌రెడ్డి, ఉమా మహేశ్వరరెడ్డి, ఫోక్ అండ్ క్రియేటివిటీ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ పుష్పావతి, సర్పంచ్ రాచప్ప, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి, మండల కో-ఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషాతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం 300 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణుల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం రాతన వద్ద రైతు నీలాంబరప్ప పొలంలో వాడుపట్టిన వేరుశనగ పైరును పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, కోదండ, బుడ్డన్న, నరసింహులు, బసవరాజు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

80,451 గడపల సందర్శన

మద్దికెర: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీదేవి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 300 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక కమ్యునిటీ భవనంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే శ్రీదేవి నియోజకవర్గంలోని 78 సచివాలయాల పరిధిలో 80,451 గడపలను సందర్శించి ఆయా కుటుంబసభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో తెలుసుకోవడంతో పాటు అర్హులై ఉండి పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. సలహాదారు ఆంజనేయులు, సర్పంచ్ విజయుడు, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

తుగ్గలి: అనంతపురంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ కేంద్ర స్థాయి పోటీల్లో తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతిని విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) నిర్వహించిన పోటీల్లో తుగ్గ లి సచివాలయ వలంటీర్ రాములమ్మ, నెట్టికంతయ్య దంపతుల కూతురు మానస లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరిచింది. దీంతో మానసను మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అభినందించారు. జాతీయస్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఉమా మహేశ్వర రెడ్డి, విష్ణువర్ధనరెడ్డి ఉన్నారు.

క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాకే ఓట్ల తొలగింపు



వెల్దుర్తిలో ఓటరు జాబితా వెరిఫికేషన్‌లో ప్రత్యేకాధికారి అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: గతేడాది జనవరి 6 నుంచి ఇప్పటివరకు మండలంలో తొలగింపబడిన ఓటర్ల జాబితాను పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల రీ వెరిఫికేషన్ స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తనిఖీ చేశారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ప్రసాద్ రాజు, ఆర్ఐ మస్తాన్, బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. జాబితా నుంచి తొలగించిన ఓట్లు (డబుల్ ఎంట్రీలు, అడ్రస్ మార్పు, చనిపోయిన వారు) మండలంలో 2,430 ఉండగా వాటిని పరిశీలించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. జాబితా తొలగించిన ప్రతి ఓటుకు తగిన కారణాలతో నివేదిక ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి ఓటు హక్కు తొలగించేందుకు కారణాన్ని వివరిస్తూ, నోటీసు ఇచ్చి, ఆయా ఓటరు సంబంధీకులు, చుట్టుపక్కల వారి సంతకాలు, సాక్ష్యాలతో కూడిన ఫారంలను జత చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో రైతు నవీన్ తన రెండెకరాలలో నాటుకున్న 400 సీతాఫలం పండ్ల మొక్కలను పరిశీలించారు. పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా అవకాశం కల్పిస్తోందని రైతులు ముందుకు రావాలన్నారు. మార్గమధ్యలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను సందర్శించి జరుగుతున్న పనులు, చెత్త సేకరణ, వర్మీ తయారీని పరిశీలించారు. ఏపీఓ రాజు నాయక్, సిబ్బంది ఉన్నారు.

కృష్ణగిరి: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు పక్కాగా చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ అమర్‌నాథ్ రెడ్డి ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన ఓటర్ జాబితాలో చేపడుతున్న సవరణను పరిశీలించి బీఎల్‌ఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తొలగించిన ఓట్లను మరోసారి పరిశీలించాలి



మాట్లాడుతున్న ఆలూరు ఈఆర్వో మల్లికార్జున

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో చనిపోయిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపుపై మరోసారి పరిశీలన చేయాలని ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారి మల్లికార్జున ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓ కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ నాయకుల అభ్యంతరాలు స్వీకరించి అసౌకర్యంగా ఉన్న పోలింగ్ కేంద్రాల మార్పును రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆలూరు నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటి వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి 97.7 శాతం ఓటరు జాబితా సవరణ పూర్తి చేశారన్నారు. మిగిలిన 2.3 శాతం ఇళ్ల డోర్ లాక్ ఉన్నాయని చెప్పారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేస్తామన్నారు. హొళగుంద తహసీల్దార్ హుసేన్ సాహెబ్, ఎన్నికల డీటీ గుండాల్‌నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసవన్న గౌడ్ ఉన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



ఎమ్మిగనూరు 16వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎర్రకోట జగన్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజల అవసరాలకనుగుణంగా పలు వార్డుల పరిధిలో కోట్లాది రూపాయలతో మంచినీటి పైపు లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డులో రూ.15 లక్షలతో సీసీ రోడ్డుకు, 23వ వార్డులో రూ. 9.5 లక్షలతో సీసీ డ్రైన్, 24వ వార్డులో రూ. 10.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు వాహిద్, చంద్రమోహన్ రెడ్డి, రుద్రాక్షాల బజారితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆ మేరకు దశలవారిగా మంచినీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. శివారు ప్రాంతాల్లో సైతం రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఏఈ శరత్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బుట్టారంగయ్య, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ

నందవరం: నందవరంను కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానం చేసినట్లు ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథ రామయ్య ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరైన వానలు లేక సాగు చేసిన పంటలు పూర్తిగా వాడిపోయాయన్నారు. రైతులు నష్టపోకుండా కరవు మండలంగా ప్రకటించాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులతో చర్చించి నందవరం మండలాన్ని కరువు మండలంగా తీర్మానించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. అలాగే గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పల్లెల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కో-ఆప్షన్ మెంబర్ షేక్‌అహ్మద్, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీలు, ఆయా గ్రామల సర్పంచ్‌లు, వివిధ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



ఆర్‌అండ్‌బీ ఏఈని నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

హొళగుంద: అధ్వాన్నంగా ఉన్న ఆదోని - హొళగుంద రోడ్డును ఎప్పుడు బాగు చేస్తారని ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తంబాకు నూర్జహన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇంగళదహాళ్ ఎంపీటీసీ మల్లికార్జున, కో ఆప్షన్ మెంబర్ టీపీ సాయిబేష్, పెద్దగోనేహాళ్, ఇంగళదహాళ్ గ్రామ సర్పంచ్‌లు కొత్తింటి వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు ఆదోని రోడ్డు పరిస్థితి గురించి ఆర్‌అండ్‌బీ ఏఈ రవికాంత్‌ను నిలదీశారు. సమస్య గురించి చెప్పినా పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. హొళగుందలోని సచివాలయాల్లో ఉద్యోగులు ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, వివిధ పనుల కోసం వెళ్లిన వారితో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. త్వరలో వారితో సమావేశం ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ హామీ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్ మాట్లాడుతూ.. హొళగుంద, లింగంపల్లి, ముగుమానుగుంది, కోగిలతోట, సుళువాయి తదితర గ్రామాల్లో జేజేఎం కింద ఇంటింటికీ కొళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. పొలాలకు ఇచ్చే 9 గంటల విద్యుత్ సక్రమంగా అందించాలని కోరగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఏఈ ఓబులమ్మ తెలిపారు. ఏఓ ఆనంద్ లోకదళ్ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 9,600 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు జరిగిందని వెల్లడించారు. విద్య, అగ్రికల్చర్, పశువైద్యం, పీఆర్, ఉపాధి హామీ పథకం తదితర శాఖల అధికారులు సమావేశంలో మాట్లాడారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతకు రూ.6 వేలు

మద్దికెర: జగనన్న కాలనీల్లో ఇల్లు పూర్తియిన వారు ఇంకుడు గుంతలు తవ్వుకుంటే అదనంగా రూ.6 వేలు మంజూరు చేస్తామని హౌసింగ్ ఏఈ ఉమా కాంత్ మంగళవారం తెలిపారు. ఇళ్లు నిర్మించుకుంటున్న వారు బాత్‌రూంకు సంబంధించి నీరు రోడ్లపై ప్రవహించకుండా ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు తీసుకోవాలని సూచించారు.

నేడు 'రాష్ట్రానికి రక్ష జగనన్న' కార్యక్రమం

వెల్దుర్తి: రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని బాలుర హైస్కూల్ మైదానంలో 'రాష్ట్రానికి రక్ష జగనన్న' కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పట్టణంలోని ఎస్సీ, బీసీ గురుకులాలు, కస్తూర్బా, బాలికల హైస్కూల్ విద్యార్థినులు పాల్గొననున్నట్లు చెప్పారు. సాయంత్రం ఎల్ నగరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టనున్నట్లు సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నందవరం: అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న 5 ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామ సమీపంలో తుంగభద్ర నదిలో మంగళవారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వాటిని స్టేషన్‌కు తరలించి నిందితులు మిట్టసోమపురం గ్రామానికి చెందిన చిట్టిబాబు, శ్రీనివాసులు, రామకృష్ణతో పాటు తెలంగాణ రాష్ట్రం, గద్వాల జిల్లా, అయిజ మండలం, రాజాపురం గ్రామానికి చెందిన కురవ తిరుమల్లేష్, తెలుగు ఉసేని, బోయ వీరేష్, కురవ లింగప్ప, రవిపై కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

నందవరం: మండల పరిధిలోని కనకవీడు, కే.పేట గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలను పరిశీలించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో నూతన భవనాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. కేంద్రాలలో పిల్లల హాజరు, పౌష్టికాహారం కిట్లు, మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌష్టికాహార కిట్ల సక్రమంగా పంపిణీ చేయాలని, స్కూల్‌కు వచ్చే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు తల్లికి వందనం



వెల్దుర్తిలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసిన బాలికల హైస్కూల్ ఉపాధ్యాయినులు

వెల్దుర్తి: స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం చంద్రావతి ఆధ్వర్యంలో తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి, క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా విభాగాలకు సంబంధించిన వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. అంతకు ముందుగా పాఠశాల ఉపాధ్యాయినుల ఆధ్వర్యంలో విద్యార్థినులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండులోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి వందనం చేశారు.

మాచాని సోమప్ప జెడ్పీహెచ్ఎస్‌కు అవార్డు



డీఈఓ రంగారెడ్డి చేతులమీదుగా ప్రతిభా అవార్డులు అందుకుంటున్న పీడీలు, హెచ్ఎం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాల 2022-23 విద్యాసంవత్సరానికిగాను క్రీడా సమాఖ్య పోటీల్లో ప్రతిభ చాటి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు సాధించి జిల్లాలో మొదటి స్థానం దక్కించుకుంది. ఈ మేరకు మంగళవారం కర్నూలులోని బి.క్యాంప్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో బాలికల పాఠశాల పీడీలు సుజన కుమారి, నాగేశ్వరితో పాటు హెచ్ఎం కృష్ణమూర్తి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుతో పాటు ప్రసంశా పత్రాన్ని డీఈఓ రంగారెడ్డి చేతుల మీదుగా అందుకొని సత్కారం పొందారు. ఈ అవార్డును ప్రస్తుతం రెండోసారి దక్కించుకోవడం విశేషం. పాఠశాల నుంచి గత విద్యా సంవత్సరంలో స్కూల్ గేమ్స్‌లో 22 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా అందులో భవాని అనే విద్యార్థిని బ్రాంజ్‌మెడల్ సాధించింది. రగ్బీలో ముగ్గురు విద్యార్థినులు విన్నర్లుగా నిలిచి 96 పాయింట్లు సాధించడంతో ఈ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పీడీలను విద్యార్థుల తల్లి దండ్రులు అభినందించారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ సుదర్శన్ రెడ్డి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బడి నాడు- నేడు ఫేజ్-2 అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ దశరథ రామయ్య, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ-1, 2 ఆధ్వర్యంలో జీఈఆర్ సర్వే, మన బడి నాడు- నేడు అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 5 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సు గల పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు జీఈఆర్ సర్వేను చేపట్టిందన్నారు. మండలంలో బడి బయటి పిల్లలు 1,217 మంది ఉన్నారని, వారిని బడిలో చేర్పించాలన్నారు. అలాగే పాఠశాలలో జరిగే అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా స్కూల్ ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. జీఈఆర్ సర్వే పకడ్బందీగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంఈఓ-2 రఘునాథ్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ మోహన్‌రెడ్డి

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగురిని నందవరం పోలీసులు దాడులు చేసి పట్టుకున్నట్లు సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నందవరం ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో నది తీరంలో మంగళవారం పోలీసులు దాడులు చేపట్టారు. నందవరం- గంగవరం గ్రామ సమీపంలోని పూలచింత క్రాస్ రోడ్డు వద్ద అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తులను వెంబడించి పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా కర్ణాటక మద్యం బయటపడింది. 26 బాక్స్‌ల (2,496 ప్యాకెట్లు) మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులు తమ స్కూటర్లపై పరారయ్యారు. ఒక మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి నలుగురు వ్యక్తులు చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన సునీల్, మహేష్, ఎమ్మిగనూరు టౌన్‌కి చెందిన ఎరుకల సుసేంద్ర, కర్ణాటక రాష్ట్రం గుండ్రేవులకు చెందిన బజారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. దాడుల్లో పోలీసులు మల్లికార్జున, వీరేష్, ఆంజనేయులు, హనుమంతు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాస్

పత్తికొండ రూరల్: గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ నారాయణదాస్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీడీఓ కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో తాగునీటి సదుపాయం, సీసీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. తహసీల్దారు విష్ణుప్రసాద్, వైస్ ఎంపీపీలు రంగమ్మ, బలరాముడు, కోఆప్షన్ సభ్యుడు నజీర్, ఈఓఆర్డీ శ్రీకాంత్‌చౌదరి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న గ్రామపంచాయతీ ఈఓ నరసింహులు

పత్తికొండ రూరల్: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈఓ నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కొమ్ముదీపిక, గౌరవ సలహాదారులు ఎస్.నాగరత్నమ్మ హాజరయ్యారు. ఈఓ నరసింహులు మాట్లాడుతూ కొత్తగా ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా గ్రామపంచాయతీ పరిధిలో తీర్మానం, ఎస్టిమేషన్ ప్రకారంగా పనులు చేయాలన్నారు. కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా గోయింగ్, ఆన్‌గోయింగ్, ఫైనల్ బిల్లులు ఇలా గృహ నిర్మాణ శాఖలో మంజూరు చేస్తున్నట్లుగా మూడు విడతలుగా బిల్లులు వస్తాయని వివరించారు. సర్పంచ్ కొమ్ము దీపిక మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ నిధులు వచ్చాయని త్వరలో అవసరమైన చోట పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్‌అండ్‌బీ ఏఈ శ్వేత, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



రేణుక (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో ఓ వివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ తిమ్మయ్య తెలిపిన మేరకు వివరాలు.. నాగలదిన్నె గ్రామానికి చెందిన పరశురాం, పార్వతమ్మ దంపతుల కుమార్తె రేణుక (26) పురుగు మందు తాగి ఆత్యహత్యకు పాల్పడింది. రేణుకను 8 ఏళ్ల క్రితం ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రవికి ఇచ్చి వివాహం చేశారు. అయితే రవి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలు సంతానం. తల్లిదండ్రులు రేణుకను స్వగ్రామానికి తీసుకొచ్చారు. భర్త మరణంతో మనస్తాపం చెందిన రేణుకు మంగళవారం ఉదయం బాత్ రూమ్‌లో పురుగు మందు తాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సీఐ మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తండ్రి పరశురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.